అమ్మకు అధిక బలం

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమానికి శ్రీకారం
- బాలింతలకు, గర్భిణులకు ఇంటి వద్దకే పౌష్టికాహారం సరఫరా
- టీహెచ్ఆర్ కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కిలారి, ప్రజా ప్రతినిధులు


నందూరు గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: బాలింతలకు, గర్భిణులకు ఇంటి వద్దకే పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ – టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం నందూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ –టేక్ హోం రేషన్ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఆరోగ్య రక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐసీడీఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో బలవర్ధక ఆహారం..

గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా బలవర్ధకమైన ఆహారం లభిస్తుందని వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ –టేక్ హోం రేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. టేక్ హోం కిట్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.శేషమ్మ అధ్యక్షత వహించారు. వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఇళ్ల వద్దకే పంపిణీ చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అందజేసే సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సిబ్బంది చిత్త శుద్ధితో అమలు చేయాలని కోరారు. ఎంపీడీవో బాబురావు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను దాతలు దత్తత తీసుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, శేషమ్మ, బి.విజయకుమార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కాకుమాను: గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్నట్లు జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారిణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తేళ్ల ప్రేమ కుమారి మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పోసమ్మ కుమారి, వెంకాయమ్మ, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషణ కిట్లు పంపిణీ

ప్రత్తిపాడు: తల్లీబిడ్డల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని ఎంపీడీవో ఎ. శ్రీరమ్య అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యక్రమాన్ని సీడీపీవో వి.సుజాతదేవి, ఎంపీడీవో ఎ.శ్రీరమ్య ప్రారంభించారు. లబ్ధిదారులకు రాగిపిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, కోడిగుడ్లు..తో కూడిన సంపూర్ణ పోషణ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీడీపీవో వి. సుజాతదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తోందని వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న ఆహారాన్ని గర్భిణులు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ రమాదేవి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సురేష్‌కుమార్, అడిషనల్ సీడీపీవో సీహెచ్. విజయ నిర్మల, సూపర్‌వైజర్లు వెంకటరత్నం, అరుణ, ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ పోషణ

పెదకాకాని: గర్భిణులకు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే ఆశయంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తోందని ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్‌లను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరిగిందన్నారు. ఈ నెల నుంచి టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) పేరుతో 3 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, 500 గ్రాములు ఆయిల్, గ్రుడ్లు 13, పాలు 2.5 లీటర్లు ఒక కిట్ లెక్కన ఇంటికి తెచ్చి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎప్పటి మాదిరిగానే రాగిపిండి 2 కిలోలు, అటుకులు కిలో, బెల్లం 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు టీహెచ్ఆర్ కిట్‌తో పాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదనంగా 15 రోజుల తరువాత 12 గ్రుడ్లు, 2.5 లీటర్లు పాలు గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. పుట్టే పిల్లలు పోషకాహార లోపం లేకుండా ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గీతాంజలి, పొన్నూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రత్నం, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, తహసీల్దారు పి.రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు మాతంగి నిర్మల, ఏసీడీపీఓ బి.గీతాంజలి, సూపర్‌వైజర్‌లు సత్యవతి, మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీరమ్య, సీడీపీవో సుజాతదేవి


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ, ప్రత్యేకాధికారి


పెదకాకానిలో పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ


చేబ్రోలులో పోషణ కిట్లు పంపిణీలో వైస్ ఎంపీపీ, తహసీల్దారు, ఎంపీడీవో

క్లుప్తంగా

'కిట్స్' కళాశాలలో జాతీయస్థాయి వర్క్‌షాప్



గుంటూరు రూరల్: వర్క్‌షాపులు నిర్వహించటం వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. బుధవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నో వేషన్స్‌పై జాతీయ స్థాయి వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి వర్క్‌షాపులను సద్వినియోగించుకోవాలన్నారు. శ్రీ చండీ దాస్ చక్రవర్తి ఆపరేషన్స్ అండ్ లాజిస్టిక్స్ సీఈవో ఫౌండర్ అనాను రాయ్‌చౌదరి విద్యార్థులు నూతన ఆవిష్కరణలు ఏవిధంగా చేయాలి, సమాజానికి ఏవిధంగా వినూత్న ఆవిష్కరణలు అందించాలో వివరించారు. విద్యార్థుల ఆవిష్కరణలు పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రొఫెసర్ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య



గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): అప్పుల బాధతో మనస్థాపానికి గురై, ఇబ్బందులు తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాల మేరకు..కొర్నెపాడు గ్రామానికి చెందిన ఈగ జనార్దన్, సరస్వతీ దంపతులు గ్రామంలోని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనార్దన్ గత రెండేళ్లుగా సుమారు ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, వ్యవసాయం చేస్తున్నారు. పత్తి, మిరప పంటలను పండిస్తున్నారు. గతేడాది వ్యవసాయంలో సుమారు రూ.7 లక్షలు నష్టపోవటంతో మనస్థాపానికి గురయ్యారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామంలోని పొలంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటన విషయం తెలిసిన మృతుని భార్య సరస్వతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

యువతిపై లైంగిక దాడి

పట్నంబజారు: యువతిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరుంధతీనగర్‌కు చెందిన యువతి గత కొన్నేళ్లుగా కాకానిలోని తన మేనత్త వద్ద ఉంటోంది. ఈ క్రమంలో మేనత్త భర్త అమీర్ యువతిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దురాగతాన్ని యువతి జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పాత గుంటూరు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకరగుంట సమీపంలోని గాజువారివీధిలో నివాసం ఉండే నరసింహారావు (61) గత నెల 28న పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి



తెనాలిరూరల్: రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు రిటైర్డ్ రైల్వే మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అసోసియేషన్ సమావేశాన్ని బుధవారం తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని కార్యాలయంలో నిర్వహించారు. విజయవాడ డివిజనల్ కార్యదర్శి బి. వెంకటసుబ్బారావు, అధ్యక్షుడు హరిరావు, కోశాధికారి, గుంటూరు డివిజనల్ కార్యదర్శి నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు తదితర నాయకులు పాల్గొన్నారు. అసోసియేషన్ తెనాలి బ్రాంచి అధ్యక్షుడు అమీరుద్దీన్‌కు 80 ఏళ్ల, వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్‌కు 85 ఏళ్లు నిండిన నేపథ్యంలో వారిని సభ్యులు ఘనంగా సత్కరించారు. పెన్షనర్ల సమస్యల గురించి చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని తెనాలి బ్రాంచి కార్యదర్శిఎం. నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- నందూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం నందూరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. నందూరులోని ఎస్సీ కాలనీలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.33 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని, బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా టేక్ హోం రేషన్ కార్యక్రమం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను తెలియజేయటంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమ లబ్ధిని వివరించి, కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో 98 శాతం అమలు చేశారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నాడు –నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్కి నాగరాజు, ఎంపీటీసీ నార్ని నాగరాజు, ఆగిశెట్టి గాంధీ, జంగా అబ్రహం, ముప్పర్తి అయ్యన్న, శ్రీనివాసరావు, అక్కల శ్రీనివాసరావు, నందూరి శర్మ, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, మనోహర ప్రసాద్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

లా ఆఫీసర్స్ నియామకంలో సామాజిక న్యాయం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి


మాణిక్యాలరావును సన్మానిస్తున్న పోలూరి

గుంటూరు లీగల్: లా ఆఫీసర్స్ నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిభ, సామాజిక న్యాయాన్ని ప్రామాణికంగా తీసుకుని అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి తెలిపారు. తెనాలి కోర్టుకు ఎం.మాణిక్యాలరావును ఏజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్థానికంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలూరి మాట్లాడుతూ తెనాలికి సంబంధించి ఎస్టీని ఏజీపీగా, ఎస్సీ, బీసీ, ఓసీని ఏపీపీలుగా, తాజాగా ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన మాణిక్యాలరావును ఏజీపీగా నియమించినట్లు తెలిపారు. ప్రతిభ, సామాజిక న్యాయం ఆధారంగా లా ఆఫీసర్స్‌ను నియమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా పేదాల పక్షాన నిలబడి వారికి న్యాయం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తిని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాణిక్యాలరావుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెనాలి కోర్టు ఏపీపీలు మోహన్‌రెడ్డి, సింకా సురేష్, మల్లికార్జున్‌రెడ్డి, ప్రభాకర్, సుబ్బారెడ్డి, గుంటూరు ఏపీపీ సుబ్బారావు, శరత్ పాల్గొన్నారు.

దారిదోపిడీ కాదు..దారిలో జరిగిన గొడవ..

- డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి
- సోషల్ మీడియా కథనాలు అవాస్తవం

గుంటూరు ఈస్ట్: శారదా కాలనీ 15వ లైనులో కొందరు యువకులు దారి దోపిడీకి పాల్పడ్డారంటూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి వివరణ ఇచ్చారు. అరండల్‌పేట పోలీసుస్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన అరండల్‌పేట ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌తో కలసి మాట్లాడారు. సోమవారం రాత్రి శారదాకాలనీ 15వ లైనులో సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీ రోడ్డుకు అడ్డంగా తమ ద్విచక్ర వాహనాలు పెట్టి మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో శివనాగరాజు, వెంకట్రావు, శరత్‌కుమార్ అక్కడకు వచ్చి ద్విచక్ర వాహనాలు అడ్డం తీయాలని కోరారు. ఈ నేపథ్యంలో వారి మధ్య గొడవ జరిగింది. సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీ వీరిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అనంతరం వారు శివనాగరాజు కాలనీలోని క్రాంతి ఇంటికి వెళ్లారు. పాత పరిచయం నేపథ్యంలో రమణ అనే మహిళ అక్కడకు రావడంతో నలుగురు యువకులు ఆమెతో గొడవ పడ్డారు. రమణపై దాడి చేసి ఆమె స్కూటీని ధ్వంసం చేశారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. తెలిపారు. వాహనాలు అడ్డు పెట్టిన విషయంలో గొడవ జరిగింది తప్పా, దారిదోపిడీ కాదని తెలిపారు.

ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్, సెక్రటరీ మరియేలు, ఎంపీడీఓ

ప్రత్తిపాడు: ఏపీ ఎన్‌జీవో 21వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని అసోసియేషన్ ప్రత్తిపాడు తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ సీహెచ్.అనిల్‌కుమార్ కోరారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర మహా సభలు జరగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎంపీడీవో ఎ. శ్రీరమ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహా సభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఉద్యోగులంతా సభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు నేరుగా సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు మహా సభలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్. వెంకటరెడ్డి, ప్రత్తిపాడు తాలూకా సెక్రటరీ మరియేలు, ట్రెజరర్ శేషగిరిబాబు, ఈసీ మెంబరు సీహెచ్ శివనాగు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రామకోటయ్య, ఉమెన్ వింగ్ చైర్ పర్సన్ శ్వేత పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


అన్నదానం చేస్తున్న తులసీ ధర్మచరణ్ తదితరులు

గుంటూరు రూరల్: మనిషి సంతోషంగా ప్రశాంతంగా జీవించాలంటే దేవుని సన్నిధి ఎంతో మేలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ తెలిపారు. బుధవారం గోరంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ వేడుకకు ముఖ్య అతిథిగా తులసి ధర్మచరణ్ హాజరయ్యారు. స్వామి ఉత్సవ విగ్రహాలకు, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల వద్ద నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మనకు అందుబాటులో ఉన్న దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గోరంట్లలోని దేవాలయాల అభివృద్ధికి యర్రంశెట్టి వేణుగోపాల్ ఎంతో కష్టపడుతున్నారని అభినందించారు. గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ స్వామి వారికి నూతన యజ్ఞోపవీతం దండాన్ని తయారు చేయించామని, ఇందుకు సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొడుగులూరి సుబ్బారావు, తాళ్ల శ్రీనివాస్, తోట రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్యాలీగ్రఫీ పోటీ పరీక్షలో ప్రథమ స్థానంలో సుస్మితా చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: అఖిల భారత హ్యాండ్ రైటింగ్–క్యాలీగ్రఫీ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాలీగ్రఫీ పోటీ పరీక్షలో గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ కె. సుస్మితా చౌదరి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు క్యాలీగ్రఫీ నిపుణుడు పి.బి.చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు సైతం క్యాలీగ్రఫీ అకాడమీ ఏటా చేతిరాత పోటీ పరీక్షల్ని నిర్వహిస్తోందని తెలిపారు. గత జూన్ 20న రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన పోటీ పరీక్షకు 4,213 మంది పాల్గొనగా, వారిలో ప్రథమ స్థానంలో నిలిచిన సుస్మితా చౌదరి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అలరించిన భక్తి రాగమాలిక



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై డాక్టర్ చింతలపాటి గోపాలకృష్ణ జయంతి సందర్భంగా బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో «భక్తి రాగమాలిక పదములు» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతలపాటి రమా మహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, నాగలక్ష్మి, పావని బృందం పలు వాగ్గేయకార కీర్తనల్ని ఆలపించి భక్తుల్ని అలరించారు.

ఎన్జీరంగా వర్సిటీలో బళ్లారి రాఘవ జయంతి



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం నగర శివారులోని లాం ఫాం నందు నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి రాఘవ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రముఖ న్యాయవాదిగా రాఘవ చేసిన సేవలను కొనియాడారు. నాటక రంగంపై మక్కువతో రంగస్థలంపై నటిస్తూ వివిధ బాషల్లో పలు దేశాల్లో మన సంస్కృతిని చాటిచెప్పారన్నారు. నాటక రంగంలో స్త్రీలను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, కంప్ట్రోలర్ డాక్టర్ ఏవీ రమణ, ఎస్టేట్ ఆఫీసర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రాత్రిళ్లు.. మహాప్రస్థానం వాహనాలు



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి భౌతికకాయాల్ని ఇతర జిల్లాలకు సైతం రాత్రి సమయంలో కూడా ఉచితంగా తరలించేలా ఏర్పాట్లు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రైవేటు అంబులెన్సుల ఆగడాల్ని కట్టడి చేసేందుకు బుధవారం రాత్రి రెండు వాహనాల్ని రాత్రి సమయంలో అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచితంగా అందిస్తున్న మహాప్రస్థానం సేవల్ని మరింత పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజూ సుమారు 15 మృతదేహాల్ని మహాప్రస్థానం ద్వారా ఇళ్లకు ఉచితంగా తరలిస్తున్నట్లు వెల్లడించారు.

ఆయుష్ వైద్య విభాగం తనిఖీ

జీజీహెచ్ ఆవరణలోని ఆయుష్ వైద్య విభాగాన్ని బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. వైద్య విభాగంలో అపరిశుభ్రమైన వాతావరణం ఉందని, తక్షణమే క్లీనిక్ చేయించుకోవాలని ఆదేశించారు ప్రకృతి వైద్యం, యూనాని వైద్య సేవల్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

జామ మొక్కల పంపిణీ

తెనాలిఅర్బన్: డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ శారద ఆధ్వర్యంలో బుధవారం చినరావూరు రైల్వే స్టేషన్ రోడ్డులో ఇంటింటికి జామ మొక్కల పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో వాటిని నాటాలని ఆమె సూచించారు. ప్రతి రోజు 2500 మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, వైస్ ప్రిన్సిపల్ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్ల అపహరణ

తెనాలిరూరల్: పందెం కోళ్లు అపహరణకు గురైయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల మేరకు జగ్గడిగుంటపాలెం శివారులో సుభాని పందెం కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లు ఉన్న గది పైకప్పు రేకులను సోమవారం రాత్రి తొలగించిన దుండగులు లోనికి వెళ్లి ఎనిమిది కోళ్లను అపహరించుకెళ్లారు. దీనిపై పెంపకందారుడు పోలీసులకు సమాచారమిచ్చాడు మినహా లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని తెలిసింది. అపహరణకు గురైన కోళ్ల విలువ సుమారు రూ. 1.60 లక్షలు ఉంటుందని తెలిపాడు.